వెంకటేశ్వర్‌రెడ్డికి ఉత్తమ రైతు పురస్కార మెమెంటోను అందించి అభినందనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఉత్తమ రైతు అవార్డు గ్రహీతకు మాజీ ఎమ్మెల్యే సునీత అభినందన

రాజాపేట, డిసెంబర్ 25 : మండలంలోని నెమిలే గ్రామానికి చెందిన రైతు మేక వెంకటేశ్వర్‌రెడ్డికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల ఉత్తమ రైతు పురస్కారం లభించింది. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి బుధవారం వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసి అభినందించారు. ఆమె వెంట మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకట్రాంరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, నాయకులు బెడిదె వీరేశం, ఎర్ర గోకుల జస్వంత్, చింతల రాజు ఉన్నారు.

చిరు జల్లు

యాదగిరిగుట్టపై కురుస్తున్న జల్లు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 25 : ఆల్పపీడన ప్రభావంతో యాదగిరిగుట్ట మండల వ్యాప్తంగా తేలికపాటి జల్లులు కురిశాయి. బుధవారం తెల్లవారు జాము నుంచే ఆకాశంలో పూర్తిగా మబ్బులు కమ్మి జల్లులు మొదలయ్యాయి. వాతావరణ ప్రభావం వల్ల 10 గంటల వరకు ఎండ రాలేదు. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు చలితో కొంత ఇబ్బంది పడ్డారు. జల్లుల్లో తడుస్తూ మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆలేరు టౌన్, డిసెంబర్ 25 : పట్టణంలోని 4వ వార్డుకు చెందిన వల్లాల యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ రూ.5వేలు ఆర్థిక సాయం అందించగా ఆ నగదును పార్టీ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశ్ గౌడ్ బుధవారం బాధిత కుటుంబానికి అందించాడు. కార్యక్రమంలో చింతకింది మురళి, బీజని మధు, కూతాటి అంజన్ కుమార్, సారాబు సంతోశ్, ఎండీ. ఫయాజ్, సత్తయ్య, శంకరయ్య ,వెంకటేశ్, శ్రీను, గణేశ్, సిద్దిరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు శారాజీపేట విద్యార్థినులు

అలకుంట్ల వైష్ణవి — దూడల తేజస్వి — వస్పరి జాగృతి

ఆలేరు రూరల్, డిసెంబర్ 25 : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని శారాజీపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్ఎం జ్యోతిరాజ్, పీడీ గడసంతుల మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరిలో ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన అలకుంట్ల వైష్ణవి, దూడల తేజస్వి, కబడ్డీ పోటీల్లో వస్పరి జాగృతి ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎన్నికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈనెల 26 నుంచి 29వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

జ్ఞాపికలతో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు సన్మానం

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 25 : ఇటీవల బదిలీపై వెళ్లిన, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య, కార్యదర్శి మెతుకు సైదులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ హక్కుల కోసం పోరాటం చేయడంతో విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు దొడ్డి స్వామి, శ్రీనివాస్, రమేశ్, వెంకన్న, దొడ్డి రవి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు రూ.18 వేల వేతనం అందించాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నీలగిరి, డిసెంబర్ 25 : ఆశ కార్యకర్తలకు రూ.18వేల కనీస వేతనం అందించడంతో పాటు పీఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్న బస్సు జాతా బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుంది. జాతాకు ఆశ కార్యకర్తలు బతుకమ్మలు, బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆశ కార్యకర్తల వేతనం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు.అధికారంలోకి వచ్చి ఏడాదైనా వాటిని అమలు చేయడం లేదన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశ కార్యకర్తల వేతనాలు పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం చేపట్టాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు.కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి టి. వెంకటమ్మ పాల్గొన్నారు.

నల్ల బెల్లం, సారా పట్టివేత : ఇద్దరిపై కేసు

స్వాధీనం చేసుకున్న నల్ల బెల్లం, పటికతో ఎస్ఐ వీరన్న, సిబ్బంది

మద్దిరాల, డిసెంబర్ 25: అక్రమంగా నిల్వ ఉంచిన క్వింటా నల్ల బెల్లం, ఐదు కేజీల పటిక, 10 లీటర్ల సారాను పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీరన్న తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని గుట్టకాడి తండా ఆవాసం సెట్రాం తండాకు చెందిన కొర్ర శ్రీను తన ఇంట్లో నల్ల బెల్లం నిల్వ ఉంచాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో క్వింటా నల్ల బెల్లం, ఐదు కేజీల పటిక లభ్యమైంది. అదే తండాకు చెందిన నేనావత్ దుర్గమ్మ ఇంట్లో 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ నిషేధిత కార్యక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కంకర తేలిన కూరెళ్ల – రాఘవాపురం రోడ్డు

గుంతలమయంగా పల్లెపహాడ్ – కోరటికల్ రోడ్డు

అధ్వానంగా లింకు రోడ్లు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 25 : మండలంలోని గ్రామాలకు వేసిన బీటీరోడ్లు గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు ప్రచారంలో ప్రతి పల్లె రోడ్లను మరమ్మతులు చేస్తామని వాగ్దానాలు చేసిన పాలకులు ఇప్పుడు కనుమరుగయ్యారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. మండల కేంద్రంతో పాటు కోరటికల్, పల్లెపహాడ్, కూరెళ్ల, రాఘవాపురం, రహీంఖాన్‌పేట, లింగరాజ్‌పల్లి, సర్వేపల్లి, టీ రేపాక, ఉప్పలపహాడ్ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై రాత్రి సమయంలో ప్రయాణికులు ప్రమాద బారిన పడి గాయపడిన సంఘటనలూ ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే పైళ్లను కించ పర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

భువనగిరి అర్బన్ : సీఐ సురేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి : మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తున్న బిగ్ టీవీ చానెల్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పైళ్ల శేఖర్‌రెడ్డి నియోజవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ఆయనపై కుట్రపూరితంగా అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. మండలంలో ఎమ్మెల్యే బంధువులు, కార్యకర్తలు ఒక్క కాంట్రాక్టు చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. నిరూపించకుంటే మీరు కూడా శిక్షకు సిద్ధం కావాలని సవాల్ చేశారు. త్రిపుల్ ఆర్ రోడ్డును మారుస్తామని గొప్పలు చెబుతున్న మంత్రి కోమటిరెడ్డి.. ఏడాదిగా దాని ఊసే తీయడం లేదని మండి పడ్డారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రతినిధులు నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని అయినా చేపట్టారా అని ప్రశ్నించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ సామ రవీందర్ రెడ్డి, నాయకులు రావుల శేఖర్‌రెడ్డి, బత్తుల శ్రీశైలంగౌడ్, చిలువేరు బాలనరసింహ, సామల మల్లారెడ్డి, పగిల సుధాకర్‌రెడ్డి, దేవరాయ కుమార్, గునిగంటి మల్లేశ్‌గౌడ్, చింతకింది కిరణ్, కుడికాల బలరాం, కొమ్ము శ్యామ్, ఉపేందర్‌రెడ్డి, కర్నాటి అంజమ్మ, రాజమణి, సత్తయ్య పాల్గొన్నారు.

టీవీ చానెల్‌పై ఫిర్యాదు

భువనగిరి అర్బన్ : మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేసిన బిగ్ టీవీ చానెల్‌పై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ సురేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని, ఓటమి అనంతరం కనుమరుగయ్యారని ఆరోపిస్తూ చానెల్ అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. టీవీ చానెల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ.కిరణ్ కుమార్, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయన ఆంజనేయులు, కౌన్సిలర్లు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : ఎస్ఐ భాస్కర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం) : వెంకటేశ్వర్లు కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 25 : మండల కేంద్రానికి చెందిన చేపూరి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంకటేశ్వర్లు పదో తరగతి మిత్రులు ఆయన కుటుంబానికి రూ.52వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. కార్యక్రమంలో ఏనుగు వెంకటనారాయణరెడ్డి, దంతూరి మల్లికార్జున్ రెడ్డి, నర్సయ్య, పద్మా రెడ్డి, లక్ష్మయ్య, శ్రీను, స్వామి పాల్గొన్నారు.

బీబీనగర్ : ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ పేపర్‌ను రాజు కుటుంబ సభ్యులకు అందిస్తున్న గురువు సలీమ్, స్నేహితులు

బీబీనగర్ : మండల కేంద్రానికి చెందిన దార రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన వెంట స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో 2001లో పదో తరగతి చదివిన స్నేహితులు రాజు కుమార్తె పేరు మీద రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సంబంధిత బాండ్ పేపర్‌ను అప్పటి గురువు సలీమ్ చేతుల మీదుగా బుధవారం రాజు కుటుంబ సభ్యులకు అందించారు. అదే విధంగా విశ్రాంత ఉపాధ్యాయుడు సలీమ్ రూ.10 ఆర్థికసాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. ఇద్దరు పిల్లలను ఇంటర్ వరకు చదివిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రవి కుమార్, సునీల్ కుమార్, లావణ్య, నళిని, భాస్కర్, సురేశ్, నిరంజన్, మహేశ్, సత్యనారాయణ, గణేశ్, వెంకటేశ్, రామాంజీ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి : బీఆర్ఎస్

ఎండీ మున్నా

బీబీనగర్, డిసెంబర్ 25 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్‌వీ భువనగిరి పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ మున్నా బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గురుకులాలకు అద్దె బకాయిలు చెల్లించాలని కోరారు.

పేకాట స్థావరాలపై దాడి

చౌటుప్పల్‌రూరల్, డిసెంబర్ 25 : పట్టణంలో పేకాట స్థావరాలపై ఎస్ఓటీ పోలీసులు బుధవారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5600 నగదు, ఐదు బైకులు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాటిమట్లలో 8మంది అరెస్టు

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామ పరిధిలోని క్రాస్ రోడ్డు సమీపంలో పేకాట స్థావరాలపై ఎస్వోటీ పోలీసులు దాడులు జరిపి పేకాడుతున్న 8మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.24,370 నగదు, 8 సెల్‌ఫోన్లు, 14 సెట్ల కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి

- పంట దిగుబడిలో మొలక శాతం కీలకం
- రైతులకు అధికారుల సూచనలు

నేరేడుచర్ల, డిసెంబర్ 25: యాసంగి వరి సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కొందరు రైతులు ఇప్పుడే నార్లు పోస్తుండగా, మరికొందరు నాట్లు వేస్తున్నారు. అయితే, నారు పోసే సమయంలో సరైన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో రైతులు విత్తనాల ఎంపికకు అధిక ప్రాధాన్యమివ్వాలని చెబుతున్నారు. విత్తనం ఎంపికపైనే పంట దిగుబడి ఆధాపడి ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన విత్తన రకాలు, వాటి వివరాలపై ప్రత్యేక కథనం.

విత్తనాలు నాలుగు రకాలు

నాణ్యమైన విత్తనాలు నాలుగు రకాల్లో లభ్యమవుతాయి. బ్రీడర్, ఫౌండేషన్, సర్టిఫైడ్, ట్రూత్‌ఫుల్ లేబుల్స్‌లో విత్తనాలు లభ్యమవుతాయి.

బ్రీడర్ విత్తనం

ఇది అన్ని రకాల విత్తనాలకు మూల విత్తనం. దీన్ని కంపెనీలు ఆయా బ్రీడర్ల పర్యవేక్షణలో పండిస్తారు. వ్యవసాయ పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు రూపొందించేవి ఇలాంటి విత్తనాలే. ఈ విత్తనం 100 శాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. బ్రీడర్ సీడ్‌కు బంగారు రంగు ట్యాగ్ వేస్తారు. సీడ్ ధర చాలా ఎక్కువ. రైతులకు రెండు కిలోలకు మించి బ్రీడర్ సీడ్ ఇవ్వరు.

ఫౌండేషన్ విత్తనం

ఈ విత్తనాన్ని బ్రీడర్ విత్తనం నుంచి ఉత్పత్తి చేస్తారు. వివిధ విత్తనోత్పత్తి సంస్థలు, సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో పండిస్తారు. దాదాపు 100 శాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. ప్రైవేటు విత్తన కంపెనీలు వ్యవసాయ పరిశోధన కేంద్రాల నుంచి బ్రీడర్ విత్తనాలు తీసుకొని వెళ్లి ఫౌండేషన్ విత్తనాన్ని తయారు చేస్తాయి. ఈ సీడ్‌కు తెలుపు రంగు ట్యాగ్ వేస్తారు.

సర్టిఫైడ్ విత్తనాలు

విత్తనం నుంచి నేరుగా సర్టిఫైడ్ (ధ్రువీకరించిన) విత్తనాలను ఉత్పత్తి చేస్తారు. వివిధ సంస్థలు, రైతుల పొలాల్లో కూడా విత్తన పర్యవేక్షకుల సమక్షంలో పండించే అవకాశం ఉంది. ఈ విత్తనానికి నీలిరంగు ట్యాగ్ వేస్తారు.

ట్రూత్‌ఫుల్ లేబుల్

సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి చేసిన ఈ విత్తనాన్ని విత్తిన ధ్రువీకరణ సంస్థ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ విత్తనాలను ట్రూత్‌ఫుల్ లేబుల్ కింద రైతులకు విక్రయిస్తుంటారు. ఈ విత్తనానికి ఆకుపచ్చ రంగు ట్యాగ్ వేస్తారు. లేబుల్ ట్యాగ్‌పై విత్తన పరీక్ష చేసిన తేదీ ఉంటుంది. ఆ తేదీ నుంచి తొమ్మిది నెలల కాల పరిమితిలోపు కొనుగోలు చేయవచ్చు.

రైతులు పాటించాల్సిన సూచనలు

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై నంబర్, విత్తన రకం, గడువు తేదీలు, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయొద్దు.
- గడువు దాటిన విత్తనాలను కొనుగోలు చేయకూడదు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్‌పై సీలు ఉందో లేదో చూసుకోవాలి.
- కొన్న విత్తనాలను డీలరు వద్దే తూకం వేయించుకోవాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.
- విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం చూసుకోవాలి. మొలక శాతం బాగా ఉన్న విత్తనాలనే వాడుకోవాలి.

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కారు బోల్తా

భువనగిరిలో ఇద్దరు మృతి.. మరో ఐదుగురికి గాయాలు

నుజ్జయిన కారును పరిశీలిస్తున్న పోలీసులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 25 : దైవదర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా.. ప్రమాదవశాత్తు కారు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పరిధిలో బుధవారం జరిగింది. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లోని పలు కాలనీలకు చెందిన శ్రీను, అర్జున్, మితిన్ రామంతాపూర్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. మణిజయంత్, యశ్వంత్ నారాయణగూడలోని నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాగా, బుధవారం క్రిస్మస్ సెలవు కావడంతో యాదగిరిగుట్టకు వెళ్లాలనుకున్నారు. అదే కాలనీకి చెందిన మహ్మద్ అబ్దుల్ సుఫ్యాన్ ఇన్నోవా కారును అద్దెకు తీసుకుని యాదగిరిగుట్టకు దైవదర్శనానికి వెళ్లారు. దర్శనం తర్వాత తిరుగు ప్రయాణంలో ఓ హోటల్లో టిఫిన్ చేశారు. అనంతరం భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి క్షేత్రాన్ని దర్శించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో భువనగిరి పట్టణ పరిధిలోని బొమ్మాయిపల్లి చౌరస్తా సమీపంలో కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ మహ్మద్ అబ్దుల్ సుఫ్యాన్(25), యశ్వంత్(17) అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న అర్జున్, నితిన్, శ్రీను, మణిజయంత్, కారు డ్రైవర్ వెంట వచ్చిన 9వ తరగతి విద్యార్థి షాకిబ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. గాయాలైన వారిని 108 వాహనంలో భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. భువనగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు పల్టీ.. ఇద్దరికి గాయాలు

పల్టీకొట్టిన కారు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 25 : పట్టణ పరిధిలోని రాయగిరి వద్ద బుధవారం కారు అదుపుతప్పి పల్టీ కొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన నర్సింహారెడ్డి ఆలేరు నుంచి హైదరాబాద్‌కు తన కారులో వస్తుండగా మార్గమధ్యంలో రాయగిరి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కే క్రమంలో అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్‌తో పాటు నర్సింహారెడ్డికి గాయాలయ్యాయి.

హామీలను నెరవేర్చాలి : సీపీఎం

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి

మోత్కూరు, డిసెంబర్ 25 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను విస్మరించి, ప్రజా పాలన పేరుతో విజయోత్సవాలను జరుపుకుంటుందని విమర్శించారు. రైతు భరోసాను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండి పడ్డారు. వ్యవసాయ కూలీలకు రూ.12000, వృద్ధులు, దివ్యాంగుల పింఛన్ పెంపును పట్టించుకోవడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జాడే లేదని, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేపడుతున్న ఆశ కార్యకర్తలపై పోలీసులతో దాడులు చేయించి కేసులు పెట్టించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సమావేశంలో పానుగుల రమేశ్, గుండు వెంకటనర్సు, పైళ్ల యాదిరెడ్డి, కురిమేటి యాదయ్య, మామిడి కృష్ణ, కందకూరి నర్సింహ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్

పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్ 25 : పట్టణంలోని బస్టాండ్‌లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి బ్యాగులు తనిఖీ చేయగా 14 కేజీల గంజాయి లభించింది. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్కెనపల్లి జిల్లాకు చెందిన చెల్లూరి నాగవెంకట కృష్ణవేణి, అడ్డూరి ప్రసాద్, కిమ్మిడి ప్రశాంత్‌గా గుర్తించారు. వీరు విశాఖపట్నంలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మన్మథరావు తెలిపారు.

ముదిరాజ్‌లకు ఇండ్లు మంజూరు చేయాలి : హన్మంతు

సమావేశంలో మాట్లాడుతున్న కందుల హన్మంతు

రామన్నపేట, డిసెంబర్ 25 : అర్హులైన ముదిరాజ్ కుల స్తులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కందుల హన్మంతు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యదర్శి పిట్టల మత్స్యగిరి, డైరక్టర్లు కందుల శ్రీను, రేపాక రాజు, బైరబోయిన వేణు, పెద్దబోయిన మీనమ్మ, బచ్చ అంజమ్మ పాల్గొన్నారు.

కత్తితో గొంతు కోసుకున్న మానసిక రోగి

- ఆస్పత్రికి తరలించిన పోలీసులు

నీలగిరి, డిసెంబర్ 25: మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి బుధవారం తెల్లవారు జామున నల్లగొండలోని క్లాక్‌టవర్ వద్ద తాగిన మైకంలో గొంతు కోసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని ఆస్పత్రికి తరలించారు. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు కథనం ప్రకారం.. నల్లగొండ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సయ్యద్ నదీమ్ కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతూ రోడ్లపై తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన నదీమ్ లతీఫ్ సాబ్ గుట్ట సమీపంలోకి వెళ్లి మద్యం సేవించాడు. తాగిన మైకంలో కత్తితో తన గొంతు కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న అతడిని గమనించిన స్థానిక యువ